క్లుప్తంగా

సమ్మెకు సిద్ధంకండి



కరపత్రాలను విడుదల చేస్తున్న స్ట్రగుల్ కమిటీ నాయకులు

ఎర్రగుంట్ల: విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల, ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్స్‌ను పరిష్కరించాలని కోరుతూ బుధవారం నుంచి సమ్మెకు సిద్ధం కావాలని విద్యుత్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. సుబ్బిరెడ్డి కోరారు. సోమవారం ఆర్టీపీపీలోని పవర్ హౌస్ గేటు వద్ద సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. సమస్యలను పలు మార్లు విద్యుత్ యజమాన్యం దృష్టికి తెచ్చామని, అయినా స్పందించలేదని తెలిపారు. కార్మికులను పర్మినెంట్ చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

చింతకొమ్మదిన్నె : మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఉదయం 10:30 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కుల్లాయిబాబు తెలిపారు. మండల పరిధిలో వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్య, రెవెన్యూ శాఖ, గ్రామీణ నీటిపారుదల, పారిశుద్ధ్య, ఎన్ఆర్ఈజీఎస్, పశు వైద్యం, విద్యుత్ శాఖ తదితర శాఖల పనితీరు, పురోగతిపై చర్చించనున్నట్లు తెలిపారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన



నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

వీరపునాయునిపల్లె: ప్రభుత్వ వైద్యులు తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని 15రోజులుగా చేపడుతున్న సమ్మెకు మద్దతుగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి వైద్యుల సమస్యలను, వైద్య, ఆరోగ్యశాఖలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. వైద్యులు గ్రామీణ, దూర ప్రాంతాల్లో తీవ్ర ఇబ్బందులతో ప్రజలకు సేవలు అందిస్తున్నప్పటికీ వారికి సరైన గుర్తింపు, ప్రోత్సాహం లభించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వైద్యుల హక్కులను గౌరవించి ఆరోగ్య వ్యవస్థ బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

లింగాల : మండల కేంద్రమైన లింగాల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రసన్న రాణి తెలిపారు. సోమవారం ఆమె తెలుపుతూ ఈనెల 16వ తేదీలోగా పదవ తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 17వ తేదీ ఉదయం 10గంటలకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆమె తెలిపారు.

పచ్చని చెట్లే ప్రగతికి మెట్లు



ర్యాలీలో అధ్యాపకులు, విద్యార్థులు

వేంపల్లె : పచ్చని చెట్లే ప్రగతికి మెట్లు అని, చెట్ల పెంపకంతో గ్రామాలు, పట్టణాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందని ప్రిన్సిపాల్ ఎస్.నాగేంద్ర పేర్కొన్నారు. సోమవారం వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వేంపల్లెలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మానవ మనుగడకు ప్రాణం పోసేది మొక్కలేనని, మొక్కలను నాటడం కూడా అభివృద్ధిలో భాగమని చెప్పారు. రోజు రోజుకూ పెరుగుతున్న కాలుష్య నియంత్రణకు, పర్యావరణ సమతుల్యానికి మొక్కలను తప్పకుండా పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.ఓబులరెడ్డి, అధ్యాపకులు వినోద్, సుధాకర్, రాజారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

జనవరిలో టిడ్కో ఇళ్లు పంపిణీ

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల మున్సిపల్ పరిధిలోని నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు జనవరిలో అందజేస్తామని మున్సిపల్ కమిషనర్ శేషఫణి తెలిపారు. సోమవారం తన చాంబర్‌లో మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డితో కలసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యర్రగుంట్ల మున్సిపల్ పరిధిలోని 1,525 మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను కేటాయించారన్నారు. వీటిలో 1,255 మంది లబ్ధిదారులకు వారి పేర్ల మీదనే కమలాపురం రిజిస్ట్రేషన్ పూర్తిందని తెలిపారు. ఇంకా 270 మంది పెండింగ్‌లో ఉన్నారని చెప్పారు. వీరందరికి త్వరలోనే నోటీసులిచ్చి రిజిస్ట్రేషన్ చేయిస్తామని పేర్కొన్నారు. టిడ్కో ఇళ్ల సముదాయంలో రూ.8.2 కోట్లతో మౌలిక సదుపాయలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎరికలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంతో ప్రజలను చంపేస్తారా?

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజం
- నకిలీ మద్యం కేసును సీబీఐకి అప్పగించాలి
- ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి
- కూటమిపై దండెత్తిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



జమ్మలమడుగు: ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు



పులివెందుల: ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు



పులివెందుల: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు



జమ్మలమడుగు రూరల్: కోటి సంతకాల సేకరణలో సంతకం చేస్తున్న పి. రవీంద్రనాథ్‌రెడ్డి



ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జమ్మలమడుగు/జమ్మలమడుగు రూరల్: 'రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారుతోంది. అమాయక ప్రజలు మద్యం తాగి చనిపోతున్నారు. అయినా కూటమి ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోంది' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం నకిలీ మద్యంపై జమ్మలమడుగులోని కన్నెలూరు మోటు నుంచి శివాలయం మీదుగా ఎక్సైజ్ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా వెళ్లి ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో నకిలీ మద్యంతోపాటు బెల్టుషాపుల్లో విచ్చలవిడిగా మద్యాన్ని విక్రయిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మద్యంలో ఎటువంటి అక్రమాలు జరుగకపోయిన కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణిలో సంబంధంలేని వ్యక్తులపై కేసులు పెట్టి జైలులో పంపారని తెలిపారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనే టీడీపీ నాయకులు నకిలీ మద్యం తయారు చేసి రాష్ట్రమంతా సరఫరా చేస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

ప్రైవేటీకరణపై ప్రజా ఉద్యమం

పేదలకు మెరుగైన వైద్యాన్ని, వైద్య విద్యను అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుడితే, ప్రైవేటీకరణ ద్వారా వాటిని సీఎం చంద్రబాబు పేదలకు దూరం చేస్తున్నారని పి. రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. కన్నెలూరులోని శివాలయంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలంటూ 101 కొబ్బరికాయలు కొట్టి కోటి సంతకాల ఉద్యమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తన బినామీలకు మంచి చేయడం కోసమే ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం దిగివచ్చేంత వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజల సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కూటమి పాలనపై ప్రజల్లో భ్రమలు తొలిగాయని, అన్ని రంగాల్లో విఫలమైందని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలన్నీ పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు.

విచ్చలవిడిగా నకిలీ మద్యం సరఫరా

ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచ్చలవిడిగా కల్తీ మద్యం సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు నాణ్యమైన మద్యం అందిస్తామని, తక్కువ ధరలకే మద్యం అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు సర్కార్ అధికారంలోకి వచ్చాక ప్రజలకు కల్తీ మద్యాన్ని అంటకట్టి వారి జీవితాలతో చెలగాటమాడుతోందని ధ్వజమెత్తారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువులో వెలుగుచూసిన నకిలీ మద్యం తయారీ రాకెట్‌లో ప్రభుత్వ పెద్దల సహకారం ఉందని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి నేతల ధనదాహం కోసం పేద ప్రజల ప్రాణాలను బలితీసుకోవాలని చూడటం సిగ్గుచేటన్నారు. నకిలీ మద్యం వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు జరపాలని, అలాగే బడి, గుడి సమీప ప్రాంతాల్లో ఉన్న బార్లు, మద్యం షాపుల లైసెన్సులు రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, జిల్లా మహిళ అధ్యక్షురాలు అన్నపురెడ్డి రాణి, మున్సిపల్‌వి భాగ జిల్లా అధ్యక్షుడు హృషికేశవరెడ్డి, పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, లోగిడి జయన్న, మైనార్టీ నాయకుడు బి.గౌస్‌లాజం, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు లక్షుమయ్య, వేణు, ముల్లాజానీ, ఎస్సీ విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్, ధన్నవాడ మహేశ్వరరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై వైఎస్సార్‌సీపీ పోరుబాట

పులివెందుల : పులివెందులలో తెలుగుదేశం పార్టీ నాయకులు రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారించడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు పోరుబాట పట్టారు. సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మహిళా నాయకులతో కలిసి పాత ఎమ్మెల్యే కార్యాలయం నుంచి మినీ సెక్రటేరియట్ వద్ద ఉన్న ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అంతకుముంద పాత ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఉన్న వైఎస్ జయమ్మ పార్కులో దివంగత వైఎస్ జయమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుంచి ప్లకార్డులు చేతబట్టి నకిలీ మద్యాన్ని అరికట్టాలి, సీఎం డౌన్ డౌన్, ఉయ్ వాంట్ జస్టిస్ నినాదాలు చేస్తూ సెంట్రల్ బోలే వార్డు మీదుగా పాత ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌కు చేరుకుని అక్కడ ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి ర్యాలీగా వెళ్లి ఎక్సైజ్ కార్యాలయం వద్ద బైటాయించి ధర్నా చేపట్టారు. అనంతరం ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డికి వినతి పత్రం అందించారు.

ఏరులై పారుతున్న నకిలీ మద్యం

వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతోందని, రాష్ట్రాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు మద్యాంధ్ర ప్రదేశ్‌గా మారుస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని ప్రవేశపెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలప్పుడు చంద్రబాబు రూ.100లకే నాణ్యమైన మద్యం అని ప్రచారం చేశారని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలను హరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎలాంటి మద్యం కుంభకోణం జరగకున్నా.. జరిగినట్లుగా వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు బనాయించి అరెస్టులు చేశారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఊరూరా యథేచ్ఛగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. దినసరి కూలీలు, ఇతర సామాన్య ప్రజలు యాప్ ద్వారా నకిలీ మద్యాన్ని ఎలా గుర్తిస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ మండలాల కన్వీనర్లు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ మద్యంతో కూటమి ప్రభుత్వానికి కౌంట్ డౌన్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు సాయినాథశర్మ, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

కమలాపురం: నకిలీ మద్యం సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వానికి కౌంట్ డౌన్ ప్రారంభమైందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్ఈసీ సభ్యుడు కాశీభట్ల సత్య సాయినాథశర్మ, రాష్ట్ర కార్యదర్శి, పరిశీలకుడు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజలను టార్గెట్ చేసి మొలకలచెరువు కల్తీ మద్యాన్ని అమ్ముతున్నారని తెలిపారు. పేదలు డబ్బు ఇచ్చి విషం కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. రూ.130 మద్యం బాటిళ్లలోనే ఇలాంటి కల్తీ ఎక్కువగా జరుగుతోందని తెలిపారు. దీని వలన పదుల సంఖ్యలో గ్రామాల్లో మరణాలు సంభవిస్తున్నాయని, చాలా మంది పేదలకు కిడ్నీ, లివర్ చెడిపోతోందన్నారు. వెంటనే ప్రభుత్వం బెల్ట్ షాపులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి నాయకులు తప్పు చేస్తే వారిని వైఎస్సార్ సీపీ కోవర్టులు అనడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. మంత్రి రాం ప్రసాద్‌రెడ్డి చీప్ లిక్కర్ విషయంలో తాను కాణిపాకం వెళ్లి ప్రమాణం చేస్తా అని చెప్పడం ఆయన అవినీతికి అద్దం పడుతోందన్నారు. చీప్ లిక్కర్ వ్యవహారంపై సీబీఐ విచారణకు ఆదేశించడానికి ప్రభుత్వం ఎందుకు వెనుకడుగు వేస్తోందని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి జాలి, దయ లేదని, కల్తీ మద్యం ఇచ్చి కన్నతల్లులకు గర్భశోకాన్ని మిగిల్చుతున్నారన్నారు. ఈ మద్యం తాగడం వలనే మహిళల మెడలోని తాళిబొట్లు తెగిపోతున్నాయని, ఈ మరణాలు ప్రభుత్వ ఖాతాల్లో లేవన్నారు. మరణించిన వారికి ప్రభుత్వమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బాలికల విద్యతోనే మహిళా సాధికారత



ప్రతిజ్ఞ చేస్తున్న డిప్యూటీ హెచ్ఈఓఆర్ తదితరులు

పులివెందుల టౌన్ : బాలికల విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని డిప్యూటీ హెచ్ఈఓఆర్ ప్రసన్నలత పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక అంకాలమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం, పీసీపీఎన్‌డీటీ యాక్టుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల భవిష్యత్ కోసం బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలైన లింగ అసమానత్వం, బాల్య వివాహాలు, విద్య, ఆరోగ్య హక్కులు సాధించడం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. లింగ నిర్ధారణ తెలిపితే చట్టరీత్యా ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధించే చట్టం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వం కల్పించే ఆర్థికపరమైన సమానత్వాన్ని అందరికి అందేటట్లు చేయడం, బాలికల ఆరోగ్యంపట్ల అన్ని రకాల ఉచిత సేవలు అందించడం, రక్తహీనత లేని సమాజ స్థాపన నిర్మించడంతో బాలికలు కన్న కలలు మంచి ఆరోగ్యంతో అధిరోహించవచ్చని తెలిపారు. అనంతరం వారు బాలికల భవిష్యత్‌పై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జీవ ఎరువులతో భూసారం పధిలం



విద్యార్థులకు జీవ ఎరువుల ప్రాముఖ్యతను వివరిస్తున్న సమన్వయకర్త కృష్ణప్రియ

చింతకొమ్మదిన్నె: తాడిగొట్ల గ్రామంలో జీవ ఎరువుల వినియోగంపై సోమవారం కడప డాట్ సెంటర్ సమన్వయకర్త కృష్ణప్రియ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవ ఎరువులు వినియోగించడం వలన భూసారం పధిలంగా ఉంటుందని తెలిపారు. అనంతరం జీవ ఎరువుల ప్రాముఖ్యత, వాటి ఉపయోగం ద్వారా నేల సారాన్ని పెంపొందించడం, రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించడం, పర్యావరణహిత వ్యవసాయం సాధ్యమవుతుందనే విషయాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమాలను తిరుపతి వ్యవసాయ కళాశాల, ఉదయగిరి ఎస్ఎంజీఆర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు నిర్వహించారు. విద్యార్థులు గ్రామంలోని రైతులతో సంభాషించి, వారి వనరులు, వ్యవసాయ పరిస్థితులు, సమస్యలు, అవసరాలను విశ్లేషించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ప్రత్యక్ష అనుభవం పెంపొందడమే కాకుండా, రైతులలో స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు.

రైతులకు సబ్సిడీ విత్తనాలు ఇవ్వండి



వ్యవసాయ అధికారితో మాట్లాడుతున్న మాడిశెట్టి శివకుమార్

ఎర్రగుంట్ల : రైతులు సకాలంలో సబ్సిడీ విత్తనాలు అందించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మాడిశెట్టి శివకుమార్ కోరారు. సోమవారం యర్రగుంట్ల పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ అధికారి సుజనకుమార్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు సన్నద్ధమవుతున్న రైతులకు విత్తనాలకు సకాలం విత్తనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతు భరోసా కేంద్రాలలోని విత్తనాలు పంపిణీ చేశారని గుర్తుచేశారు. జగనన్న ప్రభుత్వంలో 40 శాతంతో రాయితీతో విత్తనాలు ఇచ్చారని, కుటమి ప్రభుత్వంలో 25 శాతం మాత్రమే ఇస్తున్నారని, అవి కూడా సకాలంలో ఇవ్వలేదని ఆరోపించారు. అందుబాటులో విత్తనాలు లేకపోవడంతో ప్రైవేటు దళారులు, వ్యాపారస్తులు రేట్లు పెంచి రైతులను దోపిడి చేస్తున్నారని మండిపడ్డారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోవడంలో కుటమి ప్రభుత్వం పూర్తిగా వైఫలమైందని విమర్శించారు. ఉచిత పంటల బీమా కల్పించాలని కోరారు.

జ్యూస్‌లలో రసాయనాలు కలపరాదు



జ్యూస్ సెంటర్‌లో పండ్లను పరిశీలిస్తున్న శానిటరీ సెక్రటరీ తదితరులు

పులివెందుల టౌన్ : జ్యూస్‌లలో ఎలాంటి రంగులు, రసాయనాలు కలపరాదని శానిటరీ సెక్రటరీ కృష్ణార్జునరెడ్డి జ్యూస్ సెంటర్ల యజమానులకు సూచించారు. సోమవారం పట్టణంలోని పలు ఫ్రూట్ జ్యూస్ దుకాణాలను మున్సిపల్ కమిషనర్ రాముడు ఆదేశాల మేరకు ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఫ్రూట్ జ్యూస్ దుకాణ యజమానులు తాజా పండ్లు, పరిశుభ్రమైన నీరు వాడాలని సూచించారు. పాడైపోయిన పండ్లు జ్యూస్ తయారీలో వాడినా, పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాలువ ఆక్రమణతో రైతులకు ఇబ్బందులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుసిరెడ్డిపల్లె పంచాయతీలోని అప్పరాజుపల్లె గ్రామ రెవెన్యూ పొలంలో గోపులాపురం గ్రామానికి చెందిన కొందరు రైతులు సర్వే నంబర్ 256లోని చిన్న కట్టు కాలువను ఆక్రమించడంతో కొండ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరు చింతకొమ్మదిన్నె చెరువుకు చేరకుండా సమీప గోపులాపురం గ్రామ రైతుల పొలాల పైకి వచ్చి పడుతుండడంతో పంటలు నష్టపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చిన్న కట్టు కాలువ ఆక్రమణలు తొలగించాలని సోమవారం చింతకొమ్మదిన్నె తహసీల్దార్ నాగేశ్వరరావుకు కమలాపురం బీజేపీ కన్వీనర్ చంద్రమోహన్ రెడ్డి వినతిపత్రం సమర్పించారు. కాలువ ఆక్రమణతో రైతులు సమీపంలోని కొండ ప్రాంతానికి పశువులు తీసుకువెళ్లాలన్నా, రైతులు పొలాల వద్దకు వెళ్లాలన్నా చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆక్రమణలు తొలగించి చింతకొమ్మదిన్నె చెరువుకు వర్షపు నీరు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ మండల కన్వీనర్ వెంకటసుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, గాలి గణేష్ మహేష్, రైతులు పాల్గొన్నారు

స్మార్ట్ కిచెన్ సెంటర్‌కు భూమిపూజ

లింగాల: మండల కేంద్రమైన లింగాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో స్మార్ట్ కిచెన్ సెంటర్ నిర్మాణానికి సోమవారం పంచాయతీరాజ్ ఏఈ మనోహర్‌రెడ్డి భూమిపూజ చేశారు. రూ.38లక్షల డీఎంఎఫ్ నిధులతో ఈ భవన నిర్మాణాన్ని చేపడుతున్నామని ఏఈ మనోహర్‌రెడ్డి తెలిపారు. స్మార్ట్ కిచెన్ సెంటర్‌లో మధ్యాహ్న భోజనాన్ని తయారు చేసి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేయనున్నారు. అలాగే అర్ధాంతరంగా ఆగిపోయిన జిల్లా పరిషత్ పాఠశాల భవనాలను అధికారులు, కూటమి నాయకులు పరిశీలించారు. త్వరలో పాఠశాల భవనాలను పూర్తి చేయించేందుకు కృషి చేస్తామని నాయకులు, అధికారులకు హామీ ఇచ్చారు.

సమాజాన్ని మార్చేది ఉపాధ్యాయులే



ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ ఫైల్స్‌ను అందిస్తున్న ఎస్టీయూ నాయకులు

వేంపల్లె : సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, ఉపాధ్యాయ వృత్తికి వన్నె తీసుకరావాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వరరెడ్డి ఆకాంక్షించారు. సోమవారం డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన నూతన ఉపాధ్యాయులుగా స్థానిక జిల్లా పరిషత్ బాలుర, ఉర్దూ పాఠశాల్లో చేరిన వారికి ఎస్టీయూ రూపొందించిన సర్వీస్ రూల్స్ ఫైల్స్‌ను ఆయన అందించారు. ఈ సందర్భంగా సంగమేశ్వరరెడ్డి మాట్లాడుతూ డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు, పిల్లలకు గుణాత్మక విద్య సాధనలో వృత్తి ధర్మాన్ని నిక్కచ్చిగా పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఎస్టీయూలో సభ్యత్వం పొంది సంఘ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెడ్మాస్టర్లు ప్రసాద్, శివమునెమ్మ, పీజీటీ అవ్వారు రమేష్, ఎస్టీయు నాయకులు లక్ష్మీనరసింహ, ధర్మారెడ్డి, జనార్దన్ రెడ్డి, మహబూబ్ బాషా, శ్రీనివాస్ రెడ్డి, నరసింహారెడ్డి, మస్తాన్ వల్లి, అక్బర్ బాషా, రాయుడు, సిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు డీఎస్సీలో ఎంపికైన ముగ్గురు ఉపాధ్యాయులు సోమవారం విధుల్లోకి చేరారని మండల విద్యాశాఖాధికారి–2 , పాఠశాల హెచ్ఎం రామాజంనేయరెడ్డి తెలిపారు. ఈ ముగ్గురిలో చంద్రకాంత్, బాలాజీ పీఈటీలుగా, అనూష ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలుగా బాధ్యతలు చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి పీఈటీ తిరుపాల్‌రెడ్డి, ఉపాధ్యాయుడు తుపాకుల చంద్ర ఓబుళరెడ్డిలు ఉన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి



సీపీఆర్ విధానంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీకర్

చింతకొమ్మదిన్నె : సీపీఆర్ విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చింతకొమ్మదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీకర్ అన్నారు. డాక్టర్ లక్ష్మీకర్ ఆధ్వర్యంలో చింతకొమ్మదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో కార్డియో పల్మోనరీ రీససిటేషన్‌పై సోమవారం డెమోన్‌స్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు లక్ష్మీకర్ మాట్లాడుతూ ఒక వ్యక్తికి గుండె కొట్టుకోవడం స్తంభించడం లేదా ఊపిరితిత్తులు శ్వాస తీసుకోని స్థితిలో ఉంటే అలాంటి వారికి సీపీఆర్ చేయాలన్నారు. గుండె ఆగిపోవడం, మెదడుకు రక్తసరఫరా ఆగిపోవడం వలన మరణాలు సంభవిస్తున్నాయని, అయితే వీటిలో చాలా మరణాలు మనం నివారించడానికి వీలైనవిగా ఉంటాయని పేర్కొన్నారు. సీపీఆర్ చేయడం వలన శరీరమంతా ఆక్సిజన్‌తో కూడిన రక్తాన్ని కదిలించడం ద్వారా మెదడు దెబ్బ తినకుండా మరణాన్ని నివారించడంలో సహాయపడుతుందన్నారు. సాధారణ పౌరులకు సీపీఆర్ గురించి అవగాహన కలిగించడం ద్వారా వారు నైపుణ్యాన్ని పెంపొందించి మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని తెలియచేశారు. అనంతరం స్థానిక స్టాఫ్ నర్స్ బ్యూలా ప్రజలకు, నర్సింగ్ విద్యార్థులకు సీపీఆర్ ఎలా చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల పట్టణంలోని రాణీవనంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీపీఆర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారిణి షాహినా సుల్తాన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పృహ కోల్పోయిన వారు, యాక్సిడెంట్ అయిన వారు, నీటిలో మునిగి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడే వారు, గుండెపోటుకు గురైన వారికి సీపీఆర్ చేయడం వలన ప్రాణాన్ని కాపాడవచ్చవన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పీ. రవిశంకర్‌రాజు, హెల్త్ సూపర్‌వైజర్ ఓబులేసు పాల్గొన్నారు.

రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు

పెండ్లిమర్రి: వ్యవసాయ సహకార సంఘం బ్యాంక్‌లో రైతులకు తక్కువ వడ్డీకే గోల్డ్ లోన్‌లు అందిస్తామని డీసీసీ బ్యాంక్ చైర్మన్ ఎం.సూర్య నారాయణరెడ్డి అన్నారు. సోమవారం వెల్లటూరు వ్యవసాయ సహకార సంఘం బ్యాంక్‌లో గోల్డ్ లోన్ క్యాష్ కౌంటర్ రూమ్, లాకర్ రూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం తమ బ్యాంక్‌లో వివిధ రూపాలల్లో వ్యవసాయ, ఎడ్యుకేషన్, హౌస్ లోన్లు అందిస్తామన్నారు. రుణాలు పొందిన రైతులు సకాలంలో చెల్లించి అధిక రుణాలు పొందవచ్చని పేర్కొన్నారు. రైతులుఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి, బ్యాంక్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే ఎలా వెళ్లేది?



రాం నగర్ కాలనీలోని రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

కమలాపురం: కమలాపురం రాంనగర్ కాలనీలోని ఓ కాలనీలో కాలువలు సక్రమంగా నిర్వహించకపోవడంతో చెత్త, మురుగు పేరుకుపోతోంది. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపైకి కాలువలోని మురుగునీరు చేరుతుండడంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. నెలల తరపడి మురుగునీరు నిల్వ ఉండడంతో దుర్వాసనతో ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మురుగునీరు దోమలకు ఆవాసంగా మారంది. దీంతో రోగాల బారిన పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.